కథ



# ఆంటీ! నా కథ రాయవూ?

- శారదా అశోకవర్ధన్

వైష్ణవి తల పట్టుకుని కూర్చుంది. ఉదయం ఆ ఫోను మోగినప్పటి నుండి ఆమె మనసు బాధతో అకలావికలమై పోయింది. తను దాదాపు రెండువందలకు పైగా కథలు రాసింది. తను ప్రత్యేకంగా స్త్రీల సమస్యలే రాయాలని అనుకోకపోయినా, తన కథలన్నీ స్త్రీల సమస్యల చుట్టూనే తిరుగుతున్నాయని విమర్శకుల అభిప్రాయాలూ పాఠకుల స్పందనా తెలిసేవరకూ తనకి అనిపించలేదు. తను స్త్రీ పక్షపాతీ కాదూ, పురుష ద్వేషీ కాదూ! కానీ కొకొల్లలుగా వున్న స్త్రీల సమస్యలు కన్యాశుల్కం కాలం నుంచి, వరకట్నం వరకు, స్వరూప స్వభావాలను మార్చుకుందే తప్ప సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదు. తను కథలు రాయడం మొదలెట్టిన కొత్తల్లో, చదువు సంధ్యలకు నోచుకోని అభాగ్యులూ, బయట ప్రపంచం తెలీని అమాయకులూ, ఆర్థికంగా నిలబడలేని అబలలూ మాత్రమే నానా అవస్థలూ పడుతూ, వాటిని తొలగించుకోవడానికి పరిష్కారాలు చూపే వారి దగ్గర మొరపెట్టుకునేవారు. తమ ఇంట్లో పనిచేసే రాములమ్మ, చదువుకోని ఎదురింటి పార్వతి, కాస్తో కూస్తో చదువుకున్నా అటు పుట్టింటి నుంచి గానీ, ఇటు మెట్టినింట గానీ, రూపాయి కావాలన్నా నోరు విడిచి అడిగి ఇవ్వడం ఇవ్వకపోవడం వాళ్ళ దయా దాక్షిణ్యాల మీద ఆధారపడి వుండడంతో, పావలా పువ్వుల కోసం, రూపాయి గాజుల కోసం కూడా ఆధారపడే పక్కింటి పద్మజ, వీళ్ళందరూ తన కథలని ఉత్సాహంగా చదివి ఆసక్తి పెంచుకునేవారు. మారాలనే ప్రబల ప్రయత్నం చేసేవారు. నా కథ రాయవూ అన్న రాములమ్మా, పార్వతీ, పద్మజలు నేడు క్రమేణా విద్యావంతులయిన బిడ్డల్నీ, ఉద్యోగస్తులయిన బిడ్డల్నీ తయారు చేసినా సమస్యలు తీరకపోగా, కొత్తరూపు దాల్చుకోవడం, అసలీ సమస్యలకి ఎప్పటికయినా పరిష్కారం ఉందా అని బాధపడేలా చేస్తోంది.

తన కథలు చదివి స్పందించి 'నా కథ వినండి ఆంటీ' అంటూ కన్నీటితో ఫోన్ చేసిన రజితని సాయంత్రం రమ్మని చెప్పింది తను. ఫోన్‌లో ఆ అమ్మాయి తనకి పెళ్ళయి ఎనిమిది నెలలు అయిందని, తను పిహెచ్‌డి చేసిన బాటనీ సైన్స్ గ్రాడ్యుయేట్‌ననీ చెప్పినప్పుడు వైష్ణవికి షాక్ కొట్టినట్లయింది. అందుకే మనసంతా అదోలా ఉంది; ఏ పని మీదా ఏకాగ్రత కుదరకుండా. ఆ అమ్మాయి సాయంత్రం నాలుగింటికి వస్తానంది. వైష్ణవి క్షణమొక యుగంలా ఆ అమ్మాయి కోసం ఎదురు చూస్తూ కూర్చుంది. అన్న ప్రకారం సాయంత్రం నాలుగింటికి వచ్చి బెల్ కొట్టింది. పక్కన తండ్రి కూడా వున్నాడు. అమ్మాయి నాజూకుగా ఈ కాలపు పిల్లల్లాగే సెల్వార్ కమీజ్‌లో వుంది. మెడల వరకూ వున్న జుట్టుకి పోనీ కట్టి క్లిప్ పెట్టుకుంది. ముక్కుకి చిన్న డైమండ్ ముక్కు పుడక, కోల మొహం, అమ్మాయి అందగత్తె కాకపోయినా ఆకర్షణీయంగా వుంది. విద్యాధికురాలు. సంస్కారవంతురాలని ఆమె మాటల్లోనే తెలుస్తోంది.

"ఏమిటమ్మా సమస్య?" అడిగింది వైష్ణవి.

ఆ అమ్మాయికి ఎలా చెప్పాలో తెలీనట్టుంది. మాటల కోసం తడబడింది. కళ్ళు అశ్రుపూరితా లయ్యాయి.

"ఆంటీ! నేను పిహెచ్‌డి థీసిస్ సబ్‌మిట్ చెయ్యబోయే ముందు నా పెళ్ళి ఫిక్సయింది."

"మీది లవ్ మ్యారేజా?"

"కాదు ఎరేంజ్‌డ్ మ్యారేజ్. పేపర్లో ప్రకటన చూసి నాన్నగారు వారిని కలిశారు. అన్ని విషయాలు మాట్లాడుకున్నారు. వాళ్ళది బాగా సంపన్నుల కుటుంబం. తండ్రి గొప్ప ఉన్నతోద్యోగి ప్రభుత్వంలో. పలుకుబడి గల ఆఫీసరు. కొడుకు న్యాయశాస్త్రంలో పట్టా పుచ్చుకుని, సౌదీ అరేబియాకి వెళ్ళిపోయాడు ధనార్జన కోసం. వాళ్ళకి అతడొక్కడే కొడుకు. పేరు కాశ్యప్. చిన్నప్పుడు పోలియో వచ్చినట్లుంది. అనేక మందుల వాడకం వల్ల మంచి ట్రీట్‌మెంట్ వల్లా పెద్దగా తెలీకపోయినా, బాగా గమనిస్తే కొంచెం కుంటడం

తెలుస్తుంది,'' దుఃఖం గొంతులోంచి మాట పెగలనీకుండా చెయ్యడంతో కాస్త ఇబ్బంది పడి చెప్పడం ఆపింది రజిత.

"ఆంటీ మేము అది కూడా గమనించలేదు. కుంటడం సంగతి కూడా పెళ్ళయ్యాకే తెలిసింది. మాది మామూలు మిడిల్‌క్లాస్ కుటుంబం. మా నాన్నగారు సెంట్రల్ గవర్నమెంట్ ఆఫీసులో గుమాస్తాగా రిటైరయ్యారు. మాకు ఆస్తిపాస్తుల మీద ఏనాడూ మోజు లేదు. నన్నూ, మా అన్నయ్యనీ చదివించడమే లక్ష్యంగా పెట్టుకున్న మా నాన్నగారు అన్నయ్యని సి.ఏ చదివించారు. నన్ను పిహెచ్‌డిని చేశారు. అన్నివిధాలా మాకన్నా హెచ్చైన కుటుంబంతో వియ్యమందడం అమ్మ భయపడుతూనే ఉంది. నాన్నని వారించింది కూడా!''

"ఒక విధంగా నిజమే అమ్మ భయం!'' ఏమనాలో తోచక నెమ్మదిగా అంది వైష్ణవి.

"అయితే పెళ్ళికి ముందు ఎంతో వినయంగా మాట్లాడారు ఆంటీ. మా అత్తగారు తరచూ మా ఇంటికొచ్చేవారు. అమ్మ ఏంచేసి పెట్టినా చాలా బాగుందనేవారు. మాకు మీ అంతస్తుతో సంబంధం లేదు. మంచి పిల్ల కోడలిగా రావాలి అంతే! అనేవారు. పెళ్ళి మాత్రం బాగా చెయ్యాలి.. అనేవారు. ఆ మాటలకే ఉబ్బిపోయి నాన్నగారు బోల్తా పడ్డారాంటీ! జాతకాలు చూసి కుదిరాయని ముహూర్తాలు పెట్టించి, ఉత్తరం రాశారు మద్రాసుకి. అప్పుడు పంపించారొక పెద్ద లిస్టు. ఏమేమి వెండి సామాన్లు కావాలో, ఎంత బంగారం పెట్టాలో, ఎన్ని చీరలు కొనాలో పెళ్ళికి ఏమేమి ఐటమ్స్ చెయ్యాలో డిన్నర్‌కి ఏమేమి ఎలా చేయించాలో మొదలైనవి. అవి చూసే అమ్మ షాక్ తింది. నేనూ నాన్నగారితో పెళ్ళి కాన్సిల్ చెయ్యమని చెప్పాను. కానీ నాన్నగారు మాత్రం డబ్బు ఖర్చయి పోయినా ఒక్కగానొక్క కూతురు సుఖపడుతుందనే ఆశతో మా మాటలు లెక్క చెయ్యలేదు. తలకుమించిన భారాన్ని నెత్తినేసుకుని, నాన్నగారు వారన్నట్లుగానే అన్నీ చేశారు. హెూటల్లో పెళ్ళి కావడం వల్ల సాయంత్రం అయిదుగంటలకి టిఫిన్‌కి వస్తామన్న వాళ్ళు అరున్నర దాకా రాకపోయేసరికి కొంతమందికి టిఫిన్లందకపోవడం, హెూటలువారు ఆరు తరవాత టిఫిన్లు చెయ్యననడం, పైగా వాళ్ళు టిఫిన్లకి మమ్మల్నడిగితే ఏదో ఒకటి చేసుండేవాళ్ళం. కానీ హెూటల్ సర్వర్‌ని అడిగితే అతనికి వాళ్ళు మగపెళ్ళివాళ్ళని ఏం తెలుసు. ఏదో ఒకటి చెప్పేశాడు. దాంతో మా అత్తగారు రెచ్చిపోయి పచ్చని పందింట్లో పదిమంది ముందూ నానా మాటలూ అనేసింది. అప్పుడే మా గుండెలు బద్దలయ్యాయి. దుఃఖాన్ని గుండెలోంచే దిగమింగుకున్నాము,'' మరి మాట్లాడలేక పోయింది రజిత.

కర్చీఫ్ మొహానికి అడ్డు పెట్టుకుని వెక్కి వెక్కి ఏడ్చింది.

కాస్సేపు ఆమె మూడ్ మారుద్దామని లోపలి కెళ్ళి కాఫీ చేసి పట్టుకొచ్చింది వైష్ణవి.

"పిహెచ్‌డి థీసిస్ సగంలో వుండడంతో నేను పెళ్ళయ్యాక ఒక నెలరోజులు ఉండి, మద్రాసు వెళ్ళిపోయాను. ఆ తరవాత కాశ్యప్ కూడా సౌదీకి వెళ్ళిపోయాడు. రెండునెలల్లో అయిపోతుందనుకున్న థీసిస్ రాయడం నాలుగునెలలు పట్టింది. దాంతో నాకు చీవాట్ల ఫోన్లు వచ్చాయి మా ఇంటికి. నాకు మానర్స్ లేవనీ, నాన్నగారికి అసలు మర్యాద తెలీదనీ వగైరా వగైరాలతో.

నాన్నగారు ఓర్చుకుని ఓర్చుకుని ఒకే మాటన్నారు. "మాకు మేనర్సూ, మర్యాదా లేకపోతే మీ డిమాండ్ల ప్రకారం పెళ్ళెందుకు చేస్తామని!'' దాంతో ఆవిడ ఆడపులిలా రెచ్చిపోయింది. "అవి డిమాండ్లంటారా? అవి ట్రెడిషన్సు! మన ఆచారాలు! అంత మాత్రం కూడా తెలీనివారు మీరు మా స్టేటస్‌కే తక్కువ!' అంది. అంతేకాదు, తనక్కడ వున్న నెలరోజుల్లో నాన్నగారు బాగున్నావా అమ్మా! అని ఫోన్‌చేసి అడగడం కూడా తప్పేనట!. "మీ కన్నా పెద్దింట్లోనే మీ అమ్మాయున్నప్పుడు బాగుండకేమవుతుంది. బాగున్నావా? అంటూ ఏమిటా ఫోన్లు?'' సాగదీసింది. అలా అంటున్నారని ఫోన్ చెయ్యడం మానేస్తే, "మీకు మేమంటే మర్యాద లేదు'' అంటూ దండకం చదివింది.

"మీరే చెయ్యొద్దన్నారుగా అని అనకపోయావా?'' అడిగింది వైష్ణవి.

"అడిగాము. వాళ్ళు అలాగే అంటూ వుంటారట. మా నాన్నగారు వెళ్ళి వాళ్ళ కాళ్ళమీద పడి వేడుకోవాలట. ఎందుకయ్యా అంటే, ఆ నెలరోజులూ నేను పరమచెత్తగా వంట చేశానట. నాకు ఏ పనీ రాదట. పైగా ఎవరితో ఎట్లా మాట్లాడాలో కూడా తెలీదట. మా అత్తగారు మామగారూ రోజూ రాజకీయాల గురించి మాట్లాడుకుంటూ కూర్చుంటారు. నాకు ఇంట్రస్టు లేదు, నాకు తెలీదు కూడా. అలా అంటే అంత మాత్రం తెలీదా? అని తిట్టారు.

"నా సైన్సు థీసిస్ వాళ్ళకి తెలుసా? అని అడగాలనిపించింది. అడగలేదు. అత్తగారు పూజ చేస్తూ వుంటే ఆమె వెనకాలే వుండి హారతి పుచ్చుకుని ప్రసాదం తీసుకునేదాకా ఏ పనీ చెయ్యకూడదట. అది కూడా తెలీని నువ్వు, పిహెచ్‌డీ ఏంటీ? అని తిట్టింది.''

మళ్ళీ ఏడవడం మొదలెట్టింది.

ఊరుకోమంటూ ఓదార్చింది వైష్ణవి.

"ఆంటీ! ఒక ఆడపిల్ల పెళ్ళి చేసుకుని తన ఇంటినీ, తన వాళ్ళనీ వదిలి వేరే ఇంట్లో అడుగు పెట్టగానే, తన వాళ్ళందరినీ మర్చిపోవాలా?

ఆ ఇంటివాళ్ళనీ, వాళ్ళ అలవాట్లనీ అర్థం చేసుకోవడానికి కొంచెం సమయం పట్టదా?

అర్థం చేసుకోరెందుకు?'' ఆవేశంగా అడిగింది.

ఆమె బాధ అర్థమయినా సమాధానాలు వైష్ణవికే కాదు. రజితలా అడిగే ఏ ఆడపిల్లకీ ఎవరూ సమాధానం చెప్పలేకపోతున్నారు ఈ నాటికీ!

వైష్ణవి ఆలోచిస్తుండడం చూసి తిరిగి రజిత ప్రారంభించింది.

"ఆంటీ! పాతకాలంలోని ఆడపిల్లలు చదువు లేదని చదవించలేదనీ ఏడ్చారు. చదువుకోక పెళ్ళిళ్ళు కాకపోతే ఏడ్చారు.

"చదువుకున్నాక ఉద్యోగం చెయ్యనివ్వడం లేదని కొందరేడిస్తే, ఉద్యోగం చేసినా, ఆ సంపాదన మీద హక్కు తమది కాదనీ, తమ భర్తలదేనని ఈ నాడు ఏడుస్తున్నారు. ఉద్యోగం చేసే పిల్లకి ఆర్థిక స్వాతంత్ర్యం వుందంటారే మీ రచయిత్రులు? ఏదీ? భర్త పర్మిషన్‌తోనే వుంది ఆ హక్కు. అతని ఇష్ట ప్రకారమే ఖర్చు పెట్టాలి. డాక్టరేట్లు పొంది, మగవాళ్ళతో సమానంగా సంపాదిస్తున్నా, ఏ హక్కూ లేకుండా అడకత్తెరలో పోకలాగా మానసిక సంఘర్షణలతో నలిగి పోవలసిందేనా? పెద్ద చదువులు చదివిన మగవాడు ఇంట్లో పనులు చెయ్యాలనే రూలు లేదు. పిల్లలను కనిపెంచాలనే బాధ్యత లేదు. అదే ఆడది, చదివి అతనిలాగే ఉద్యోగం చేస్తూనే ఇంటిపనులు చేస్తూ, ఆచారాలూ మర్యాదలూ పాటిస్తూ జీవచ్ఛవంలా బతుకుతోంది. అందుకే అందుకే ఆంటీ బంధాలు తెంపుకుని ఫెమినిజం పేరుతో స్త్రీలు రచ్చకెక్కారు. వారిని సరిగ్గా అర్థం చేసుకోలేక వారి మానసిక బాధను లక్ష్యపెట్టక, సమాజం వారిని తప్పుగా అర్థం చేసుకుంటోంది.

"ఆంటీ? సృష్టిలోనే ఈ లోపం వుందా? మనలో వుందా? నాకేమీ అర్థం కావడం లేదు. పరస్పరం ఒకరినొకరు అర్థం చేసుకుంటే అసలు గొడవ లెందుకొస్తాయి. భాగ్యాన్ని బాధల్నీ కలిసి పంచుకోవడమే కదా వివాహమంటే. కానీ దాన్ని వ్యాపారంగా మార్చేస్తున్నారు. కట్నం తీసుకోమని, ట్రెడిషననీ ఆచారమనీ కానుకల కోసం పీడించడం, అంతస్థుల పేరుతో అవమాన పరచడం, ఆడపిల్లల తల్లిదండ్రుల నోళ్ళు మూసెయ్యడం ఇంకా ఇప్పటికీ జరుగుతోంది కాబట్టే, ఆడపిల్ల అని తెలీగానే, భ్రూణహత్యలూ, ఆత్మహత్యలూ జరిగిపోతున్నాయి. దీనికేం చెయ్యాలి ఆంటీ?'' రజితలో ఆవేశం కట్టలు తెంచుకుంటోంది.

"ఆంటీ? ఈనాటి ఆడపిల్ల బతుకు మరీ అధ్వాన్నం. పాతకాలంలో చదువు లేదు, ఉద్యోగం లేదు వుంటే బాగుండేదాన్నని ఏడ్చింది. ఇప్పుడు అన్నీ వున్నా, అదే అధోగతి అని తన విజ్ఞానం విద్యా, బురదలో పోసిన పన్నీరేననీ, కన్నవారిని దూరం చేసుకోలేక, కట్టుకున్న వారికి చేరువవ్వలేక సతమతమయిపోతోంది చదువు కున్న స్త్రీ దీనికి మీరు పుస్తకాలలో రాసే పరిష్కారాలు సమస్యలని రూపుమాపలేకపోతున్నాయి. ప్రాక్టికల్స్ దగ్గరి కొచ్చే సరికి, కన్నవారూ, కట్టుకున్నదీ కూడా పురుష పుంగవుడి మాతా పితల పాద ధూళి జల్లుకోక తప్పడం లేదు,'' కాస్త వ్యంగ్యంగానే అంది ముంచుకొస్తున్న ఆవేశాన్ని అణచుకోలేక రజిత.

నిజంగానే అర్థంకాని, పరిష్కారం తోచని ఆలోచనల్లో మునిగిపోయింది వైష్ణవి.

తాళితెంచుకుని వెళ్ళిపో! అని చెబుతుందా? వెళ్ళినా ఎక్కడికి అమ్మా నాన్నల తరవాత పుట్టిల్లూ మారిపోవచ్చు! ఒంటరి ఆడదాన్ని సమాజం పీక్కుతింటుంది!

అలాగే నలిగిపోతూ ఛస్తూ బతుకుతూ చదువుకున్న చదువుకీ బతుకుతూన్న బతుకుకీ సంబంధం లేకుండా బతకమంటుందా? ఏం చెప్పాలి? కాలం మారింది. ఎన్నో మార్పులొచ్చాయి. కానీ మారనిది ఆడదాని బతుకొక్కటే! నిట్టూర్చింది.

"సారీ ఆంటీ నా సోది చెప్పి మీమనసు బాధపెట్టాను'' అంది సౌమ్యంగా రజిత.

ఆమె మొహంలోని అమాయకత్వం, ఆమె మనసులోని నిర్మలత్వం వైష్ణవిని కరిగించేస్తోంది.

"రజితా! వాళ్ళంతట వాళ్ళొచ్చి నిన్ను పిలిచేదాకా నువ్వా గడపతొక్కకు. ఉద్యోగం చేసుకో! నీ కన్నవాళ్ళకి కూడా ఆర్థికంగా భారంగా నిలవకు. కాలమే ఏదో

## హాస్య వని(త)

### మరి నేనేం చేసేది?

బండారు రామలింగేశ్వరరావు 'శ్రీకృష్ణరాయబారం' నాటకంలో మూడవ కృష్ణుడు వేషంలో వచ్చి 'బావా ఎపుడు వచ్చితీవు' అన్న పద్యాన్ని గిరికీలు కొట్టిస్తూ పదినిమిషాలు పాడి, వినిపించాక, స్టేజీ మీద నుంచి లోనికి వెళ్ళిపోయాడు.

చప్పట్లతో, వన్స్‌మోర్ అన్న ఈలలతో హాలు దద్దరిల్లి పోయింది. కాని బండారు వారు మాత్రం మళ్ళీ స్టేజీమీదకు రాలేదు. తన పాట వినిపించనూ లేదు. నాటకం అంతా అయాక, బండారు వారి మిత్రులు "అలా ఎందుకు చేసావ్?' అని అతన్ని నిలదీశారు.

దానికి బండారు "నాకు స్టేజీ మీద కొచ్చి మళ్ళీ పాడాలనే ఉంది, కాని ఏం చేసేది? ఆడియన్సు వెనకగా చీకట్లో నిల్చుని చప్పట్లు, ఈలలకు నాంది పలికి ఇరుక్కుపోయానక్కడ?" అని విచారంగా ముఖం పెట్టాడు.

### ఇంతకీ మీరెవరు?

ఒక శాసనసభ్యుడు ముఖ్యమంత్రితో, "ట్రాఫిక్ పోలీసు నన్ను అనవసరంగా ఆపారు. నన్ను చాలాసేపు పోనివ్వలేదు. నేనెవరో వాళ్ళకు తెలిసినట్లు లేదు?" అన్నాడు.

"ఇంతకీ మీరెవరు?" అని అడిగాడు ముఖ్యమంత్రి.

**యం. ధర్మరాజు**

కారు ప్రమాదంలో చావుతప్పి బయటపడ్డ పేషంట్‌ను మరోసారి పరీక్షిం చాక "ఊపిరి బాగా తీసుకోగలుగు తున్నారా?" అని అప్పుడే వచ్చిన సీని యర్ డాక్టర్ అడిగాడు.

"మీరు యమధర్మరాజుగారేనా?" జూనియర్ డాక్టర్ల ప్రశ్నలతో విసిగి ఉన్న పేషంట్ వ్యంగ్యంగా అడిగాడు.

"నాపేరు యం. ధర్మరాజు, మావి డన్న ధర్మరాజు."

"అయితే నాకేం ఢోకాలేదు. ఊపిరి బాగానే తీసుకుంటున్నాను" అన్నాడు పేషంటు పక్కకి వత్తిగిలుతూ.

### అతి తెలివి

నీడకోసం చెట్టు కిందకి చేరారు ఇద్దరు పల్లెటూరిబావలు.

"ఎండ లెలా మండిపోతున్నాయో చూసావురా అమెరికావోళ్ళు అందుకే సెంద్రుడిపైకి రాకెట్టు అంపారు, సూరీడు మీదకు అంపితే అది మాడిమసై పోదూ?" అన్నాడొకడు.

దానికి ఇంకొకడు "సరేలే, అళ్ళకి తెలీపోతే, అందరికీ బుర్రలు లేనట్లేనా న్ననడిగితే నేను సెప్పనూ?" అని అన్నాడు.

"ఏదీ సూరీడు మీదకి రాకెట్టు అంప వచ్చంటావా?"

"బావా! మరేటనుకున్నావ్? పిచ్చో ళ్ళకి తెలీదు. సూరీడు మీదకు రాకెట్టు రాత్రి అంపాలని?" అని తన తెలివి తేటలకు తనే కిసుక్కుమని నవ్వాడు.

### ఇంకా పోలేదూ?

తొంభై తొమ్మిదేళ్ళు నిండిన బామ్మ పుట్టినరోజు బ్రహ్మాండంగా జరిపారు. ఆ సందర్భంలో పుట్టినరోజు శుభాకాంక్షలు చాలా వచ్చాయి పోస్ట్‌లో. వాటిని ఒక మునిమనవరాలు చదివి వినిపిస్తుంటే, 'ఏమిటీ, ముంగండ నుంచి మహీధర రాసాడా? ఆయనకువింతలేదన్నా ఎనభై పైనే ఉంటాయ్, ఇంకా బతికే ఉన్నాడా?'



అంటూ బామ్మ ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసి, ముక్కు మీద వేలు వేసు కుంది.

### ఇంకే పనీ రాదుగా!

ఒక లైబ్రరీలో సున్నాలు వేస్తున్న పనివాడు రోజంతా లైబ్రేరియన్ పుస్త కాలు చదువుతుండటం చూసి, "సారూ, తమరు ఏదో సదువుతూనే కూకున్నారు, ఇంకే పని సేయరా?" అని అడిగాడు.

"ఔను, ఇదే నా వృత్తి" అన్నాడు లైబ్రేరియన్ చిరునవ్వు నవ్వుతూ.

"మరి నిజంగా తమరేదేనా పని సేయాల్సొస్తే, ఏ పని సేయగలరంట?' అని అమాయకంగా అడిగాడు సున్నాలు వేస్తున్న అబ్బి.

**-ఆర్. సత్య**

---

పరిష్కారాన్నిస్తుంది! నాకు తెలుసు ఇది కూడా కష్టమైన పనేనని! కానీ అంతకంటే మార్గం లేదమ్మా! రాజీ పడే స్వభావం, ఓపిక ఆడదానికి అందుకే భగవంతుడు ఎక్కువగా ఇచ్చాడేమో! ఓపిక నశిస్తే, కాలం కూడా తీర్పు చెప్పక సమయం మించిపోతే అప్పుడే కొత్త నిర్ణయాలు తీసుకోవచ్చు! ఆత్మాభిమానాన్ని చంపుకొని బతకఖ్ఖర్లేదమ్మా ఈ నాటి ఆడపిల్ల! తనూ మనిషినేనని, తనకూ మనసుందని చాతకాని భర్తల మీదా, గయ్యాళి అత్తగార్ల మీదా చాటింపు చెయ్యాలి!" ఆవేశంగా చెప్పింది వైష్ణవి.

రజిత ధైర్యంగా తృప్తిగా వెళ్ళిపోయింది.

క్షణంలో మళ్ళీ తిరిగొచ్చి "ఆంటీ! నా కథ రాయండి. నాలాగా భయపడేవారికి కాస్తంత ధైర్యం, మా అత్తలాంటి గంపగయ్యాళులకీ, పెళ్ళయినా తల్లి కొంగుట్టుకుతిరిగే నా భర్తలాంటి మెతకవాళ్ళకీ, కాస్త బుద్ధొస్తుందేమో!" అంది.

"అలాగే! తప్పకుండా! ఏ ఒక్కరు మారినా నేను ధన్యురాలనైనట్టే" అంటూ కాగితం కలం తీసి రాయడం మొదలెట్టింది వైష్ణవి.

బయట చినుకులు పడ్డాయి., కంట తడిలా.

దుమ్ము రేగింది, గుండెలోని చిచ్చులా!

వైష్ణవి కలం ఆగకుండా సాగిపోతోంది కాలచక్రంలా!

మరో అయిదు నిమిషాలకల్లా తుఫానులా పరుగెత్తుకొచ్చింది రజిత.

ఆమె కంగారు చూసి, "ఏమయింది? అంత అదుర్దాగాపరుగెత్తుకొచ్చావు." అంది వైష్ణవి.

ఒక్క నిమిషం కూర్చుని ఊపిరి పీల్చుకుని "ఆంటీ! మీరువింత బాగా రాసినా నాలాంటి మధ్యతరగతి ఆడపిల్ల గురించి రాసినప్పుడు వేరే ఏ సొల్యూషనూ ఇవ్వలేరు. నాకు తెలుసు. మామూలు వారికి లేదా బాగా ఉచ్ఛస్థితిలో ఉన్నవారికీ మీ సలహాలు కథలూ అఖ్ఖర్లేదు. అందుకే నాకు తోచిన సలహా చెప్పడానికి మళ్ళీ వచ్చాను" అంది దృఢనిశ్చయంతో.

ఆశ్చర్యంగా చూసింది రజితకేసి.

రజిత సందేహంగా చూసింది వైష్ణవిని.

"చెప్పమ్మా! ఫరవాలేదు. నీ మనసులోని మాట చెప్పు" అంది భుజం నిమురుతూ.

"ఆంటీ! కాశ్యప్‌కి మా అత్తగారు మళ్ళీ పెళ్ళి చెయ్యొచ్చు. మేము పెట్టిన వెండి సామాన్లు, బంగారు నగలూ మాకు వాపసు చేశారట మొన్ననే. ఇందాకే నాన్నగారు చెప్పారు. ఈ వెండి సామాను, బంగారునగలూ ఒకవేళ మా అత్తగారు కాశ్యప్‌కి పెళ్ళి చేస్తే మళ్ళీ వాళ్ళ దగ్గర్నుంచి వస్తాయి. అయితే, పెళ్ళి హూటల్‌కీ, పందిరికీ, బాజాలకీ, భోజనాలకీ అయిన ఖర్చులన్నీ రెండు లక్షలయ్యాయి మాకు. ఒకవేళ నేను మళ్ళీ పెళ్ళి చేసుకోదలిస్తే మరో రెండు లక్షలు ఖర్చు పెట్టే శక్తి మా నాన్నగారికి లేదు. అంతా ఊడ్చిపెట్టే ఈ పెళ్ళి చేశారు. కాబట్టి, లాయర్లు కేవలం విడాకులిప్పించేసు కడుక్కోవడం కాదు. ఆ రెండు లక్షలూ మేము ఖర్చు పెట్టినవి కూడా వాళ్ళ చేత కక్కించాలి! ఈ సంగతి మన లాయర్లూ, జడ్జీలు అందరూ అర్థం చేసుకునేలా ఆడపిల్ల తండ్రికి న్యాయం జరిగేలా మీ కథలో రాయండి.

"కాశ్యప్ నన్ను విడాకులడిగితే మా లాయర్‌కి నేను అదే చెప్తాను. చెడిన బతుకును దిద్దడానికి, కనీసం ఆ డబ్బయినా ఉపయోగపడుతుంది," అని వెళ్ళిపోయింది.

వైష్ణవి ఆమె చెప్పిన ప్రతీ మాటనీ పదే పదే నెమరువేసుకుంది. అందులో అనౌత్యం ఏదీ లేదని తోచింది. పైపెచ్చు అలా చెయ్యడంలో కొంతైనా న్యాయం వుంటోంది. నిజంగా రజిత అత్తగారు లాంటి వారికీ, రజిత భర్త కాశ్యప్‌కీ కొంతైనా బోధొస్తుందేమో! కనీసం ఆ భయానికైనా కోడళ్ళని సరిగ్గా చూసుకుంటారేమో! కోడళ్ళు తప్పు చేస్తే మందలించి, బుజ్జగింపుతో తమ వైపు తిప్పుకోవాలి. తమ ప్రేమతో లాలనతో, పుట్టింటిని మరిపించాలి గానీ, దండించి, తరిమేసి, హింసించీ కాదు. మానసిక హింస భౌతికమైన హింసకన్నా ప్రమాదకరమైనది. వైష్ణవి కలం పరుగెడుతోంది!

❐